# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

-  ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.
-  హింసా మార్గాన్ని విడిచిపెట్టాలన్న మావోయిస్టుల నిర్ణయం ప్రశంసనీయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు.
-  అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి దేశాల మధ్య సహకారం పెంచుకోవాలని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ ఉద్ఘాటించారు.
-  ఈశాన్య రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత శ్రీశైలంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన కర్నూలు సమీపంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని, అక్కడి నుండి 13 వేల 429 కోట్ల రూపాయల వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, గత 16 నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వేగవంతమైందన్నారు. విద్యుత్, రైల్వే, జాతీయ రహదారులు, రక్షణ రంగాలకు చెందిన అనేక ప్రాజెక్టులను ప్రారంభించామని, వీటిద్వారా రాష్ట్రంలో కనెక్టివిటీ పెరిగి, పరిశ్రమల రంగం బలోపేతం అవుతుందన్నారు. దేశానికైనా, రాష్ట్రానికైనా ఇంధన భద్రత అవసరమన్న ఆయన.. ప్రస్తుతం 3 వేల కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టులను ప్రారంభించామని, తద్వారా దేశ ఇంధన సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. దేశ ఆర్థిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ఓ కీలక ప్రాంతమని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...37 సెకన్లు)

అలాగే.. భావితరం జీఎస్టీ సంస్కరణల అంశాన్ని ప్రస్తావించిన ప్రధానమంత్రి.. నవరాత్రి ఉత్సవాలకు ముందు ప్రజలపై పన్నుల భారం తొలగించామన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరిట రాష్ట్రంలో కార్యక్రమాలు చేపట్టడాన్ని అభినందిస్తూ.. సంస్కరణల ప్రయోజనాలు అందరికీ అందినప్పుడే అది సఫలమైనట్లుగా భావించాలన్నారు. స్థానిక తయారీ రంగాన్ని కూడా ప్రోత్సహించేలా ఈ సంకల్పం తీసుకోవాలని సూచిస్తూ..

(వాయిస్ బైట్...24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హింసా మార్గాన్ని విడిచిపట్టాలన్న మావోయిస్టుల నిర్ణయం ప్రశంసనీయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. గత రెండు రోజుల్లో 258 మంది వామపక్ష తీవ్రవాదులు హింసా మార్గాన్ని విడిచి లొంగిపోయారని ఒక సోషల్ మీడియా పోస్టులో ఆయన పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నిన్న 27 మంది, ఈరోజు 170 మంది మావోయిస్టులు లొంగిపోగా, మహారాష్ట్రలో నిన్న 61 మంది ప్రధాన స్రవంతిలోకి తిరిగి వచ్చారని ఆయన వివరించారు. దేశ రాజ్యాంగంపై తమ నమ్మకంతో హింసను విడిచిపెట్టాలనే వారి నిర్ణయాన్ని ప్రశంసించారు.

నక్సలిజం తుది దశకు చేరుకుందని, వచ్చే సంవత్సరం మార్చి 31 నాటికి నక్సలిజాన్ని తుడిచిపెట్టాలనే ప్రభుత్వ సంకల్పానికి ఈ ఘటనలు అద్దం పడుతున్నాయని అమిత్ షా తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు జైపూర్‌లోని ఖతిపుర రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల కోసం ఉద్దేశించిన వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. AC కోచ్‌లలో ప్రయాణించే వారి కోసం దుప్పటి కవర్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యాలను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అన్నారు. రైల్వే రంగం రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. కోచ్‌లలోని దుప్పట్ల శుభ్రతపై ప్రయాణీకులలో సందేహాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలనే ఉద్దేశ్యంతో పైలట్ ప్రాతిపదికన దుప్పట్ల కవర్లను ప్రవేశపెట్టామని చెప్పారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, దేశవ్యాప్తంగా దీనిని విస్తరిస్తామని రైల్వే మంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదం, ఆర్థిక అస్థిరత, వాతావరణ మార్పుల వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి దేశాల మధ్య సహకారం పెంచుకోవాలని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో జరిగిన ఐక్యరాజ్యసమితి దళాల సహకార దేశాల అధిపతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సవాళ్ళు ఒకదానితో ఒకటి అనుసంధానించబడి, జాతీయ సరిహద్దులను అధిగమిస్తాయని చెప్పారు. వివిధ దేశాలు అంతర్జాతీయ రాజకీయ పోటీ అంశాలను పక్కకు పెట్టి సహకరించుకోవాలని సూచించారు. ముప్పులను ఎదుర్కోవడంతో పాటు భద్రతను నిర్ధారించడం కోసం శాంతి పరిరక్షక దళాలను సన్నద్ధం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి (DoNER) మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈరోజు పార్లమెంట్ హౌస్‌లో ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు మంత్రిత్వ శాఖలకు సంబంధించిన కీలక కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి ఆయనకు వివరించారు. బిఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ, పోస్టల్ శాఖ కొత్త కార్యక్రమాలు, స్పీడ్ పోస్ట్ వ్యవస్థ సమర్థవంతమైన పనితీరును ఉప రాష్ట్రపతి ప్రశంసించారు. ఈశాన్య ప్రాంతంలో అభివృద్ధి, నూతన అవకాశాలు, మెరుగైన భద్రత వంటి అంశాల పట్ల రాధాకృష్ణన్ సంతోషం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అవినీతి, నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాలపై ప్రభుత్వం శూన్య సహన విధానాన్ని అవలంబిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. పారిపోయిన వ్యక్తుల అప్పగింత-సవాళ్లు, వ్యూహాలపై సదస్సును ఈరోజు ఆయన న్యూఢిల్లీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. నేరస్థులందరినీ చట్ట పరిధిలోకి తీసుకురావడానికి ఒక బలమైన యంత్రాంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. పారిపోయిన ఆర్థిక నేరస్థుల చట్టం అమల్లోకి వచ్చిన 4 సంవత్సరాలలోనే రెండు బిలియన్ అమెరికన్ డాలర్లకు పైగా మొత్తం రికవరీ అయ్యిందన్నారు. మనీలాండరింగ్ చట్టాలను కూడా బలోపేతం చేశామని, దీని వల్ల 2014 - 2023 సంవత్సరాల మధ్య సుమారు 12 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను జప్తు చేశామని
పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి, ఈశాన్య రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయి. వీటి ప్రభావంతో ప్రస్తుతం తమిళనాడు, పుదుచ్చేరి, కోస్తాంధ్ర రాయలసీమ, దక్షిణ కర్నాటక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఏడు రోజుల్లో కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది.

==============================

అమెరికా ప్రభుత్వం భారతదేశంతో ఇంధన సహకారాన్ని మరింతగా పెంచుకోవడంలో ఆసక్తి చూపుతోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. దేశ ఇంధన వనరులపై జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆ దిశగా చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇంధన సేకరణను విస్తరించడానికి భారత్ అనేక సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తోందని, గడచిన దశాబ్దంలో దేశంలో ఇంధన రంగం క్రమంగా పురోగమిస్తోందని చెప్పారు. సురక్షితమైన ఇంధన సరఫరా, స్థిరమైన ధరలు మన ఇంధన విధాన లక్ష్యాలని పేర్కొన్నారు.

==============================

భారత విదేశాంగ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈరోజు ఉగాండా అధ్యక్షుడు యోవేరి కగుటా ముసేవేనితో సమావేశమయ్యారు. పాలస్తీనాపై కంపాలాలో జరిగిన.. నాన్-అలైన్డ్ మూవ్‌మెంట్ (NAM) 19వ మిడ్-టర్మ్ మంత్రివర్గ సమావేశంలో ఇరువురు నేతలు పాల్గొని రెండు దేశాల మధ్య సాంప్రదాయ, బహుముఖ భాగస్వామ్యాన్ని పెంపొందించే మార్గాలపై చర్చించారు. పశ్చిమ ఆసియాలో శాంతి స్థాపన, స్థిరత్వాలకు భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశం సందర్భంగా కీర్తివర్ధన్ సింగ్.. మాలి విదేశాంగ మంత్రి అబ్దులాయ్ డియోప్ తోను, సోమాలియా విదేశాంగ మంత్రి అలీ మొహమ్మద్ ఒమర్ తోను సమావేశమయ్యారు.

==============================
==============================